సమస్యల పరిష్కారానికి కృషి

రెండో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలించిన సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్, మే 28: బోర్డు పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని రెండవ వార్డు ఇందిరమ్మ నగర్, బీరప్ప ఆలయం, నాగమ్మ ఆలయం, పెద్ద రోడ్, సీబీఎన్ నగర్‌లలో మంగళవారం బోర్డు అధికారులు, సిబ్బందితో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో కలిసి బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. అనంతరం బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ సమస్యకు అతి తొందరలోనే పరిష్కారం చూపించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతామని అన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ పథకం ద్వారా సుమారు వంద కోట్ల నిధులతో రెండవ వార్డుతో పాటు కంటోన్మెంట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బోర్డు సిబ్బందితో పాటు బీజేపీ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


రెండో వార్డులోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ తదితరులు

నేడు లష్కర్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, మే 28: విద్యుత్ లైన్‌లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్‌లు, మరమ్మతుల కారణంగా బుధవారం వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సర్కిల్ ఏడీఈ ఆదినారాయణ తెలిపారు. ప్రధానంగా ఉస్మానియా యూనివర్సిటీ,మోండా మార్కెట్, పాటిగడ్డ, కిమ్స్, లాలాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. రవీంద్రనగర్, పాలిక బజార్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు. అలాగే కేశవ్‌నగర్, హనుమాన్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 2.30 వరకు, కిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో బాపుబాగ్ కాలనీ, లాలాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని తార్నాకలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

రమ్షా ఖాలిక్‌కు ఎంజీయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ, మే 28: నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో రమ్షా ఖాలిక్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ బి. సరిత పర్యవేక్షణలో 'ఎ స్టడీ ఆన్ అడాప్షన్ ఆఫ్ హెచ్‌ఆర్ అనాలిటిక్స్ ఇన్ సెలెక్ట్ ఐటీ కంపెనీస్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్'అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి రమ్షా ఖాలిక్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నూతన పైపులైన్ పనులు ప్రారంభించాలి

కంటోన్మెంట్, మే 28: కొద్ది రోజులుగా మూడో వార్డులోని అన్నానగర్ ప్రాంతంలో మంజీరా నీటి సరఫరాలో కలుషిత నీరు వస్తుండడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్ సమస్యను బోర్డు సీఈఓ దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం వాటర్ బోర్డు ఏఈ శశాంక్ తన సిబ్బందితో కలిసి అన్నానగర్‌లో పర్యటించి పైపులైన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏండ్లుగా ఉన్న పైపులైన్‌లను మార్చే ప్రక్రియ చేపట్టకపోవడంతో కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానికులు వాపోయారు. దీంతో నూతన పైపులైన్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్ అధికారులకు సూచించారు. మంచినీళ్లు కలుషితమవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా ఏఈ శశాంక్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానికులు కనకయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

అన్నానగర్‌లో కలుషిత నీటి సరఫరాను పరిశీలిస్తున్న వాటర్ బోర్డు ఏఈ శశాంక్, బోర్డు మాజీ సభ్యురాలు అనిత

మ్యాన్‌క్యూన్‌కు మరమ్మతులు

బేగంపేట్, మే 28: బేగంపేట్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించే మ్యాన్‌క్యూన్‌ను ట్రాఫిక్ పోలీసులు సరిచేశారు. కొద్ది నెలల క్రితం బేగంపేట్ వరుణ్‌మోటార్స్ పై ఓవర్‌పై ట్రాఫిక్‌ను సాఫిగా పంపించి సహాయపడే విధంగా ట్రాఫిక్ పోలీసులు మ్యాన్‌క్యూన్‌ను ఏర్పాటు చేశారు. అది కొద్ది రోజులుగా కుడిచేయి విరిగి, హెల్మెట్ జారిపోయి బొమ్మ ఒక పక్కకు వంగిపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రంగారావు ఆదేశాల మేరకు మంగళవారం ట్రాఫిక్ సిబ్బంది మరమ్మతులు చేయించి మ్యాన్‌క్యూన్‌ను సరిచేశారు. ఈ మ్యాన్‌క్యూన్ పై ఓవర్‌పై ప్రమాదాలు జరగకుండా ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ బొమ్మ (మ్యాన్‌క్యూన్) కు మరమ్మతులు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

బస్తీ దవాఖాన తనిఖీ

బౌద్ధనగర్ డివిజన్ అంబన్‌నగర్‌లోని బస్తీ దవాఖానను స్థానిక కార్పొరేటర్ కంది శైలజ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులను సరిపడా నిల్వ ఉంచుకోవాలని వైద్యసిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు.
– ఉస్మానియా యూనివర్సిటీ, మే 28:

విద్యకు చట్టబద్ధత కల్పించాలి

ఎమ్‌వీ ఫౌండేషన్ ప్రతినిధులు

సమావేశంలో పాల్గొన్న ఎమ్‌వీ ఫౌండేషన్ ప్రతినిధులు, బాలికలు

అడ్డగుట్ట, మే 28 : బాలికల ఉచిత ఉన్నత విద్యకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎమ్‌వీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. మారేడ్‌పల్లి మండల పరిధిలోని సుమారు 70 మంది బాలికలతో మంగళవారం అడ్డగుట్టలోని బాబూ జగ్జీవన్ రాం భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ...ఆడపిల్లలను మగవారితో సమానంగా చూడాలని, అప్పుడే ఆడపిల్లల హక్కులను కాపాడిన వారమవుతామని తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టాలని, ఆడపిల్లలు హింసకు గురికాకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లుల సంఘం ప్రతినిధులు భాగ్య, ఎమ్‌వీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ స్వామి, సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, ఎమ్‌వీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య పాల్గొన్నారు.

టీఏఎస్‌ఎస్ నూతన కమిటీ ఎన్నిక

మారేడ్‌పల్లి మండల తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య(టీఏఎస్‌ఎస్) నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ప్రవళిక, కో కన్వీనర్‌గా మధు, కార్యదర్శిగా తబాసుమ్‌తో పాటు 25 మందితో పూర్తి కమిటీని వేయడం జరిగింది.

జూన్10 నాటికి..పాఠశాలలకు పుస్తకాలు

కవాడిగూడ, మే 28: జూన్10 నాటికి పాఠశాలలకు పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈఓ చిరంజీవి, డిప్యూటీ ఐఓఎస్‌లు స్వరూప రాణి, జయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆయా పాఠశాలలకు ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు.

ఆకలి రహిత సమాజ నిర్మాణానికి కృషి

ఖైరతాబాద్: ఆకలి రహిత ప్రపంచ నిర్మాణానికి తాము సైతం అంటూ మలబార్ గ్రూప్ ముందుకు వచ్చింది. సామాజిక సేవలో భాగంగా జీరో హంగర్ కార్యక్రమాన్ని చేపడుతున్నది. ఈ సేవల విస్తరణలో భాగంగా వరల్డ్ హంగర్ డే సందర్భంగా మంగళవారం సోమాజిగూడలోని మలబార్ గోల్డ్స్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమ లోగోను ముఖ్యఅతిథిగా హాజరైన పోలీస్ హెడ్‌క్వార్టర్స్ డీఐజీ డాక్టర్ గజారావు భూపాల్, ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ ప్రవీణ్, మలబార్ గోల్డ్ రిటైల్ హెడ్ ఆపరేషన్స్ సిరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. సిరాజ్ మాట్లాడుతూ మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో ఇప్పటికే 16 రాష్ట్రాల్లోని 37 నగరాల్లో 31 వేల మంది పేదలకు ఆహారాన్ని అందిస్తున్నామని, తాజాగా 70 నగరాల్లో 51 వేల మందికి అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా..

ఓయూలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం నివాళులర్పించారు. సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఓయూలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జ్ఞానేశ్వర్, మంద వెంకటయ్య, సతీశ్‌గౌడ్, గణేశ్‌యాదవ్, విజయ్‌కుమార్, గోపి, రవి, రాము, నరేశ్, శంకరయ్య, మహేందర్, నాగరాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ

మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో .. టీడీపీ సీనియర్ నాయకుడు బి. గౌరీశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి

నామాలగుండు చౌరస్తాలో.. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని సీతాఫల్‌మండి,అడ్డగుట్ట,తార్నాక,బౌద్ధనగర్,మెట్టుగూడ డివిజన్ల పరిధిలో నాయకులు ఎన్టీఆర్ చిత్ర పటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌లు కట్ చేశారు.ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.
– సికింద్రాబాద్

సీతాఫల్‌మండి చౌరస్తాలో.. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా సీతాఫల్ మండి చౌరస్తాలో మంగళవారం రాత్రి సికింద్రాబాద్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ హాజరై పారంభించారు.ఈ కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ,సాయి బాబా,సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లూరపు శ్రీనివాస్‌కుమార్ ,సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు జీవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.–సికింద్రాబాద్

యువకుడి రిమాండ్

కాచిగూడ: పెండ్లి చేసుకోవాలని ఓ మైనర్ వెంటపడుతున్న యువకుడిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై పి. రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన విజయ్ భాస్కర్ కుమారుడు జి.నితిన్‌కు కొన్ని నెలల క్రితం చెప్పల్‌బజార్ ప్రాంతానికి చెందిన మైనర్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో ఫోన్ నంబర్ తీసుకొని పెండ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. నితిన్ అందమైన అమ్మాయిలను పరిచయం చేసుకొని మాయమాటలు చెబుతూ బుట్టలో వేసికొని లొంగదీసుకోవడం అలవాటు. కొన్ని నెలలుగా మైనర్ వెంట పడుతుండటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న ఎస్సై రవికుమార్ మంగళవారం నితిన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కుల వృత్తిదారులను ఆదుకోవాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని కుల వృత్తిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు కోరారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సమితి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పైవిధంగా మాట్లాడారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్

కంటోన్మెంట్, మే 28: వీరాంజనేయ శివ పంచాతీయనా ఆదిత్య నవగ్రహ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ అన్నారు. ఆరో వార్డు సీతారాంపురంలో వీరాంజనేయ శివ పంచాతీయనా ఆదిత్య నవగ్రహ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు శంకర్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం దేవాలయ 22వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, దేవాలయ కమిటీ ఉపాధ్యక్షులు శేఖర్, సెక్రటరీ సాయిబాబా యాదవ్, జి కృష్ణ, విజయరాజు, కోశాధికారి నాగభూషణం, కమిటీ సభ్యులు గోపాల్ గౌడ్, సత్యనారాయణ రాజు, చంద్రమౌళి, గోవర్ధన్, కృష్ణ, సాంబమూర్తి,కాంగ్రెస్ ముఖ్య నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


వీరాంజనేయ శివ పంచాతీయనా ఆదిత్య నవగ్రహ దేవాలయంలో పూజలు చేస్తున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్

జాబ్ మేళాకు విశేష స్పందన..74 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు

కవాడిగూడ, మే 28: జాబ్‌మేళాలు అంటే ఇంజినీరింగ్ కళాశాలలకు మాత్రమే పరిమితం అయ్యేవని, ఇప్పుడు స్థానికంగా కూడా జాబ్‌మేళాలు నిర్వహిస్తుండటం వల్ల నిరుద్యోగులకు ఉపయోగకరంగా మారుతుందని ముఖ్యఅతిథిగా హాజరైన గాంధీనగర్ ఇన్స్పెక్టర్ డి. రాజు అన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని నీరజానంద విజ్ఞాన కేంద్ర ఆర్య సమాజ్, కవాడిగూడ అరైజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీయువకుల నుంచి విశేష స్పందన లభించింది. 224 మంది నిరుద్యోగులు హాజరు కాగా 74 మందికి కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ హాజరై జాబ్ అపాయింట్‌మెంట్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నీరజానంద వైదిక్ విద్యాలయ అధ్యక్షుడు పి. జనార్దన్, కార్యదర్శి గడీల ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి వనజకుమార్, ఆర్ఎస్ఎస్ సికింద్రాబాద్ విభాగ్ కార్యదర్శి భరతపూడి శ్రీనివాస్, అరైజ్ ఫౌండేషన్ డైరెక్టర్ నీలకంఠ మహదేవ్, కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి సీత సంతోష్, శంకర్, మనోహర్, శ్రీకాంత్, స్వాతి, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేశ్, డివిజన్ కార్యదర్శులు ఏ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, నాయకులు బొల్ల రమేశ్‌బాబు, నర్సింహ చారి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

జాబ్ అపాయింట్‌మెంట్ పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలి

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్ మహంకాళి అమ్మవారి టెంపుల్ పక్క వీధిలో వెంటనే ప్యాచ్‌వర్క్ పనులు చేయాలని కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి సంబంధిత అధికారులకు చెప్పారు. రోడ్డును తవ్వి తాగునీటి పైపులైన్ పనులు చేపట్టి.. మట్టికుప్పలు అలాగే వదిలివేయడంతో స్థానికులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ సిబ్బందిని పిలిచి మట్టికుప్పలను తొలగింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, నాయకులు మిర్యాల శ్రీనివాస్, గోవిందు అర్జున్, వెంకటరమణరాజు, సిబ్బంది కమలాకర్, ఎస్ఎఫ్ఏ హరినాథ్‌గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

మట్టికుప్పల పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

ఆటోమోటర్ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, మే 28 : ఆటో మోటర్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలన్నారు. తెలంగాణ పోగ్రెసివ్ ఆటో, మోటర్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా 8వ మహాసభను మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అన్ని విషయాల్లో అభివృద్ధి అని చెప్పుకుంటున్న దేశంలో అసమానతలు ఎం దుకున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు.

యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ(ఎంఎల్) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. హన్మేశ్, ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షురాలు ఎస్.ఎల్. పద్మ, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగం గౌడ్, ప్రభాకర్, నిస్సార్, అష్జల్, రవీందర్, ఖాజామియా, నారాయణ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లు ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి, మే 28: ప్రయాణికుల సౌకర్యం కోసం అవసరం ఉన్న ప్రాంతాల్లో రైల్వే స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన.. సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయంలో అల్వాల్ లయోలా కాలేజీ వద్ద ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ డీఆర్ఎస్ భర్తేశ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ నుంచి లింగంపల్లికి ఎంఎంటీఎస్ రైళ్లద్వారా ప్రయాణించే వారి సౌకర్యం కోసం కొత్తగా రైల్వే స్టేషన్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కిష్టమ్మ ఎన్‌క్లేవ్ రోడ్డు, మీనాక్షి ఎస్టేట్ అల్వాల్ నుంచి రోజు రోజుకు ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, జీహెచ్ ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ చింతల శాంతిశ్రీనివాస్ రెడ్డి, రైల్వే ట్రావెలర్స్ సంఘం కార్యదర్శి సూర్, సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, అనిల్‌కిశోర్, పరమేశ్, అర్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు

నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్, మే 28: ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించి అకారణంగా ఏటీఎం స్క్రీన్‌ను పగలగొట్టిన వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. టోలీచౌకిలోని రాహుల్ కోఆపరేటివ్ సొసైటీలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలోకి ఈనెల 26న మధ్యాహ్నం ఇద్దరు యువకులు ప్రవేశించారు. ఏటీఎం మిషన్ వద్దకు వచ్చిన వారిలో ఒకరు అకారణంగా ఏటీఎం డిస్‌ప్లే స్క్రీన్‌ను పిడికిలితో పగలగొట్టి బయటకు వెళ్లిపోయాడు. ఈ మేరకు మంగళవారం స్క్రీన్ పగిలిన విషయాన్ని గుర్తించిన టోలీచౌక్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎండీ రాహిల్ అమీన్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 427 సెక్షన్‌తో పాటు పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.